# పగా మైనస్ ద్వేషం

నాలుగు రోజులుగా ప్రతిరోజూ జరుగుతున్నట్టుగానే ఆవేళ సాయంకాలంకూడా పోస్టుమన్ సన్నగా, పొడుగ్గావున్న జనంలేని పల్చటి ఆ బాట అవతలి చివర కనబడి, కాళ్లూపుకొంటూ సైకిలుచక్రాన్ని తిప్పి తిప్పి తిప్పి తిప్పుకొంటూ ఆ యింటిముందు ఆగకుండానే వెళ్ళిపోయాడు.

ఇవాళకూడా ఉత్తరంలేదు.

ఎక్కడా స్థిరంగా నిలుచోక, ఎప్పుడూ ఆడపిల్లలా సిగ్గుపడి పక్కలకు జారిపోయే సంగీతరావు చూపులు సిగ్గువిడిచినట్టు; నాజూకు కొసలు కత్తిరింపబడి బిరుసై మోటుదేరిన అసహ్యాపు మీసాలతో, గంట్లు పడ్డ ముఖంతో, ఎండలో కాలి, నుసై, రాలిపోయిన యౌవనంతో బీదగా కనిపించే మాసిన కాకీబట్టల పోస్టుమన్ మీద నిలిచి, అతనితోపాటు బాట ఆ చివరనుంచి యింటి ముందువరకూ ప్రయాణం చేసొచ్చి, అతను ఆగకుండా వెళ్ళిపోవడంతోనే నిరాశను నింపుకున్నాయి. ఆ నిరాశలో పెడల్పయిన పల్చటి రెప్పలు తడిసి బరువెక్కి కిందకు జారి, నిలువలేక మరికాస్త వాలి, అడుక్కుదిగి, వడిలిపోయిన రెమ్మలావంగి, దిగువకొచ్చి, యింకా అడుక్కుపోయి, అట్టడుక్కుచేరి సొమ్మసిల్లిపోయినట్టు కొద్ది క్షణాలు అలానే వుండిపోయాయి.

ఇద్దరిమధ్యా యింత నిశ్శబ్దం ఎప్పుడూ ఏర్పడలేదు. నెలా పదిహేను రోజులయ్యింది భానుమూర్తినుండి ఆఖరి వుత్తరంవచ్చి. వారా

నికి ఒక వుత్తరమన్నా రాయందే వుండలేడు. ఒక్కొక్కప్పుడు ఒకే రోజున ఉదయం, సాయంకాలం టపాలలో ఉత్తరాలు అతనిదగ్గర నుండి వచ్చిన సంఘటనలు అనేకం వున్నాయి. అలాంటి భానుమూర్తి యిన్ని రోజులు వుత్తరం రాయకుండా ఎలా వుండగలిగాడు? స్నేహాన్నికూడా ప్రేమలా ఆరాధించడం నేర్చిన అతను యిన్నిరోజులుగా ఆరాధనా, అభిషేకాలు లేకుండా యీ హృదయాన్ని చీకటితో ఎలా నింపగలుగుతున్నాడు?

సంగీతరావు చూపులు కిటికీలోంచి కనిపిస్తోన్న అంతులేని గాఢమైన నీలపు రంగులో మెరుస్తోన్న బంగాళాఖాతపు అలలమీద ఊగుతున్నాయి. పొద్దు కనిపించడంలేదు. ఇళ్ళకప్పుల వెనక కప్పడిపోయింది. సముద్ర మధ్యంలో కెరటాలు ఒక దాన్నొకటి తరుముకొని ఆడుకొంటోన్న పాముపిల్లల్లా నాజూగ్గా కదులుతున్నాయి. చెట్లకొమ్మల మీంచి, ఇళ్ళకప్పులమీంచి ఎగురొస్తోన్న గాలి కళ్ళల్లో చల్లగా గుచ్చుకొని సూటిగా చూడనివ్వడంలేదు. ముక్కు రంధ్రాల్లోకి దూరి ఉక్కిరి బిక్కిరిచేసి ఆలోచించ నివ్వడంలేదు.

కిటికీ రెక్కలు దగ్గరగా వేసేశాడు సంగీతరావు. మనస్సేమీ బావుండలేదు. బజారు కెళ్దామని వేసుకొన్న బట్టల్ని విప్పేశాడు. కుర్చీ లాక్కొని అలసిపోయిన వాడిలాగ కూలబడిపోయాడు.

భానుమూర్తి ఉత్తరం రాయకపోవడానికి గల కారణం సంగీతరావు ఊహించగలడు. భానుమూర్తి జీవితంలో తొలిసారిగా మోసపోయాడు. గాయం పెద్దదే. ఎప్పుడూ గాయపడలేదు. బాధను భరించలేకపోయాడు. అందరిమీదా అతనికి కోపం వచ్చింది. అసహ్యం వేసింది.

అతను మోసపోయినట్టు విని సంగీతరావు సానుభూతిగా అతనికి ఉత్తరం రాశాడు. సమాధానంలేదు. ఆ తర్వాత నెలా పదిహేను రోజుల వ్యవధిలో అయిదు ఉత్తరాలు రాసినా సమాధానం లేదు.

ఒకరి గురించి ఒకరు త్యాగం చేసుకోవాలనుకునే స్నేహం వాళ్ళది. రెండేళ్ళే అయ్యింది ఒకళ్ళ నొకళ్ళు తెలుసుకుని. అంతకు ముందు ఓమాదిరి పరిచయమే వుండేది. రోగంతో బాధపడుతూ ఆర్థికకారణాలవల్ల మందు పుచ్చుకోపడంలేదని తెలిసి సంగీతరావు దగ్గరికొచ్చి కాస్సేపు మాట్లాడి వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ ఓ కవరు అతని చేతిలో పెట్టాడు భానుమూర్తి. అతను వెళ్ళిపోయాక సంగీతరావు విప్పి చూసుకున్నాడు. రూపాయల నోట్లున్నాయి! అప్రయత్నంగా అతనికి ఏడుపొచ్చింది. ఆ వెంటనే రిక్షా కట్టించుకుని మిత్రుడిని వెదుక్కొంటూ బయలుదేరాడు సంగీతరావు.

అలా ముఖాలుచూసుకొని చిరునవ్వులు నవ్వుకునే పరిచయం, హృదయాలు విప్పుకుని, మాటలుకూడా లేక ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకొంటూ కూర్చుని ఒకరి భవిష్యత్తుమీద మరొకరు ఆలోచనల గొడుగులుపట్టి నీడలు కురిపించి, పరస్పరం స్నేహాన్ని నిర్వహించితం చేసుకొంటూవస్తే—యింత కాలానికి అది చటుక్కున తెగిపోయినట్టయ్యింది.

కాని సంగీతరావుకు తెలుసు—యీ కోపం తనమీద కాదు. లోకం మీద. మోసగింపబడిన కళ్ళను అతడు కడుక్కోలేదు. అందరి మీదా కోపాన్ని పెంచుకొని అందరినుండీ నిశ్శబ్దంగా వుండిపోయాడు.

మిత్రుడి ప్రవర్తనకు సంగీతరావుకు కోపంరాలేదు. జాలికలిగింది. తప్పుచేసిన కొడుకును తల్లిదగ్గరికు తీసుకున్నట్టు మిత్రుడి ఆకారాన్ని

చూపుల్తో దగ్గరకు తీసుకుని, కళ్ళల్లో నిలుపుకుని, కరుణతో తడిపి, ఆ తడిలో చలికివణకుతున్న అతన్ని వెచ్చటి రెప్పలతో కప్పి దాచుకున్నాడు.

సంగీతరావు తిరిగి బట్టలేసుకుని అలా బీచ్‌వయిపు బయలుదేరాడు.

జ్వాలల్ని మింగే డ్రేగన్‌లా నల్లని భయంకరమైన సముద్రం పగటి వెలుగుల్ని మింగేస్తోంది. విశాలమైన నల్లని సముద్రపు కెరటాలు పైకి లేచి, వెలుగు కొసల్ని పట్టుకుని వేలాడి ముత్యాల్లా రాలుతున్నాయి. సూర్యుడు ఆ చివర ఒంటరిగా ఆత్మహత్యా ప్రయత్నంలో సముద్రంలోకి తొంగిచూస్తున్నాడు. పొడుగ్గాసాగిన బండరాళ్ళ నీడ ల్లోంచి పిచ్చితుప్పలు భయంతో కంపించిపోతున్నట్లు గజగజలాడుతూ బితుకు బితుకుగా రాళ్ళ తలలమీంచి ఆత్మహత్యా ప్రయత్నాన్ని చూస్తున్నాయి. సంగీతరావు రాళ్ళగుట్టలమీంచి దిగి యిసుకలోకొచ్చాడు.

సూర్యుడు ఎప్పుడు దూకేశాడో—నీళ్ళల్లో మునిగిపోతున్నాడు. చేతులు చాచినట్టు పొడుగాటి ఎర్రటి కిరణాలు కొన్ని బల్లపరుపుగా సముద్రంమీద వాలుతున్నాయి.

పాదాలకింద పాము జారినట్లు తుళ్ళిపడ్డాడు సంగీతరావు.

ఒక వేళ భానుమూర్తి నిశ్చబ్దానికి కారణం ఆత్మహ... ...

—సంగీతరావు ఆలోచించలేక పోయాడు.

వెనక్కు తిరిగి, వచ్చినదారివెంట గబగబా బయలుదేరాడు. ఇసకలో కాళ్ళు కదలడం లేదు. రాళ్ళ గుట్టలమీద కాళ్ల జారిపో

తున్నాయి. హవాయిజోడులోంచి పొడుచుకొచ్చి అరికాలిలో ఓ ముల్లు గుచ్చుకొంది. ఆగిపోయి మెల్లగా ముల్లు తీసేశాడు. నొప్పెడుతోంది. లెక్క చేయకుండా అప్‌లేండ్స్‌మీదకు వచ్చేశాడు. ఎత్తయిన ఆ యూనివర్సిటీ కేంపస్‌మీద ఓచెట్టు చిటారుకొమ్మలో చిక్కడిపోయిన ఆఖరి సూర్యకిరణం, కదులుతోన్న ఆ కొమ్మలోంచి పట్టుతప్పి చీకట్లోకి జారి పడిపోయింది.

సంగీతరావు బస్సులో ఊళ్లోకెళ్ళి మిత్రుడికి టెలిగ్రాం యిచ్చాడు——వెంటనే నీ క్షేమాన్ని టెలిగ్రాంద్వారా తెలియజెయ్యి—అని.

ఆ రాత్రి చాలా సేపటివరకూ అతనికి నిద్ర పట్టలేదు. కిటికీ లోంచి చూస్తూ కూర్చున్నాడు.

భయంకరమైన హోరు వినిపిస్తోందేతప్ప ఏమీ కనిపించడంలేదు. చీకటి మడతల్లోని మడతల్లోపలి మడతల్ని కప్పుకుని ఊరు నిద్రపోతోంది. ఊరపతల నల్లని కంబళిలా పరిచివున్న సముద్రంపైన సన్నని నెలవంక వెలుగులో పలచబడి, లేత నీలంరంగులో బూడిద చల్లినట్లు అస్పష్టమైన మసకవెలుతురుతో సముద్రం మీదకు వంగిన ఆకాశం, నిద్రపోతోన్న నగరం మీదకు పహరాకాస్తోన్న లైట్‌హౌస్ కాంతిరేఖ—చూస్తూ కూర్చున్నాడు. కాని ఆ చూపులు వేటినీ గుర్తించవడం లేదు. వట్టి నిర్లిప్తమైన, అర్థంలేని పొడిచూపు లవి. ఆలోచనలు ఎక్కడో మరోచోట. అక్కడే చూపులున్నాయి. ఆ చూపుల కొసను వేలాడుతూ భానుమూర్తి. నిద్రపోయి లేచినప్పటి కళ్లలాంటి కళ్లు. బరువయిన రెప్పలు. ఆ రెప్పలలో సగం కనుగుడ్లు దాగి అర్ధచంద్రాకారంలో కనిపించే కంటిపాపలు. అందుకే ఆ మత్తుదనం. ఆడవాళ్ళ కళ్ళల్లోలాంటి ఆకర్షణ. నుదురు చిన్నదేకాని గుండ్రటి ముఖం

కావడంవలన వెడల్పు తక్కువగావుండి పొడుగెక్కువ. మడతలు లేక నూనె రాసినట్టు నునుపుగా నాజూగ్గా కనిపించే ముఖం. ఒత్తుగా పెంచుకున్న తల. చెంపలమీద చెవుల కిందవరకూ పెంచుకున్న జుత్తులో పద్దెనిమిదో శతాబ్దపు రొమాంటిక్ కవులు గుర్తుకొస్తారు.

సంగీతరావు భానుమూర్తి జ్ఞాపకాలతో చాలాసేపు కూర్చుండిపోయాడు. హాస్టలులో పరీక్షచదువులలో మునిగిన విద్యార్థుల కంఠాలు అప్పుడప్పుడు పొడిపొడిగా వినిపిస్తున్నాయి. రూంమేట్ పుస్తకం గుండెల మీద పెట్టుకుని ఎప్పుడో నిద్రలోకి జారిపోయాడు.

సంగీతరావు లైటు ఆర్పేసి మంచంమీదకు చేరుకున్నాడు.

రాత్రి భానుమూర్తి తననే వెతుక్కుంటూ వచ్చేసినట్టు కల వచ్చింది. ఆ కల తెల్లవారుఝామునే వచ్చింది.

మర్నాడంతా భానుమూర్తి వస్తాడనీ, కనీసం టెలిగ్రామన్నా వస్తుందనీ ఎదురు చూశాడు.

ఆ తర్వాత రోజునకూడా చూశాడు.

ఆ మర్నాడుకూడా.

ఆ మర్నాడూ, మర్నాడూ, మర్నాడూ; ఆందోళనా, బాధా, నిస్పృహలు నింపుకున్న కళ్ళతో, మనస్సుతో దిగులుగా, ఒంటరిగా ఎదురు చూశాడు. పరీక్ష చదువున్నీ కూడా అలక్ష్యంచేసి రోజూ పోస్టుమన్ కళ్ళలోకీ, సముద్రపు నీళ్ళలోకీ చూస్తూకూర్చునేవాడు.

ఏడోరోజున కొంత వూరటా, కొంత ఆందోళనా కలిగించే వార్త తెలిసింది.

భానుమూర్తి యింటికి హైదరాబాదునుంచి వచ్చిన ఉత్తరం సారాంశం అది.

భానుమూర్తి బంధువుద్వారా ఆ విషయం తెలిసింది.

ఒకసారి హైదరాబాద్ వెళ్ళిరావాలని సంగీతరావుకు వుంది. కాని పదిహేను రోజుల్లో యూనివర్సిటీ పరీక్షలు. సుదీర్ఘమైన ఉత్తరం మాత్రం రాశాడు. ఒక రాత్రి ఒంటిగంటవరకూ కూర్చుని రెండేళ్ళ పరిచయాన్నీ సమీక్షిస్తున్నట్టుగా పౌర్ణమి రాత్రిళ్ళు బీచి షికార్లూ, సముద్ర స్నానాలూ, వాళ్ళ డాబామీద నిశ్శబ్దం గొడుగుపట్టిన రాత్రిని రాగాలతో నింపిన సమయాలూ, కొండలమీదకు పాకి, లోయలలోకి దొర్లినట్టున్న సన్నని పొడుగాటి అప్‌లేండ్స్ బాటలలో అర్ధ రాత్రి పిచ్చిగా తిరిగిన రోజులు-ఎన్నో జ్ఞాపకంచేస్తూ పదిహేడు పేజీల ఉత్తరం రాశాడు.

సమాధానం లేదు.

చివరకు మనసులోని బాధనంతటినీ అక్షరాలలో చూపిస్తున్నట్టు, దుఃఖంతో నిండిన హృదయం పలకలేక పోతున్నట్టు ఓ పెద్ద కాగితం మీద వంకర్లుపోయిన అక్షరాలతో ఒకే ఒక లైను—మూగపోయిన నీ హృదయవీణ యిక పలకదా? —అని రాసి, అడుగున సంతకంచేసి పోస్టుచేశాడు.

కాని వీణ పలకలేదు!

పరీక్షలు అయిపోయేవరకూ ఎలాగో ఓపిక పట్టాడు. అంత వరకూ తాత్కాలికంగా మానసిక ఆందోళననీ, మిత్రుని జ్ఞాపకాలనీ ఆవలకు నెట్టి వుంచాడు. ఆఖరి పరీక్షపేపరు రాసి తేలిగ్గా ఊపిరితీసి విడుస్తూ 'హమ్మయ్య' అని అనుకోబోయి మిత్రుడు జ్ఞాపకాని కొచ్చి

ఆగిపోయాడు. మళ్ళీ మనసునిండా ఆందోళన, బాధ. సంఘటనల్ని వెతుక్కొంటూ జ్ఞాపకాలలోంచి పరుగెత్తిన చూపులు.

ఆ మర్నాడు ఉదయంబండికే బయలు దేరాడు. స్వగ్రామానికి కూడా వెళ్ళకుండా తిన్నగా హైద్రాబాదుకే వెళ్ళాడు. కొత్తగా వెళ్ళడం.

మిత్రుని అడ్రసుపట్టుకుని తేలిగ్గానే యింటిని వెతుక్కో గలిగాడు. పెద్ద భవనంలో మొత్తం పెద్దా చిన్నా కలుపుకుని పద్దెనిమిది గదులలో ఓ గది అతనిది. ఓ రకంగా బాచ్‌లర్ క్వార్టర్. సినిమా పాటలూ, చవుకబారు సాహిత్యమూ, ఉద్యోగాలలోని రాజకీయాలూ, ప్రేమ కబుర్లూ, బస్సులలో బజారులలో భుజాలు తగిలిన అమ్మాయిల్ని గూర్చిన అనుభవాల నెమరువేతలూ, సిగరెట్టు పీకలూ తప్ప ముగ్గులూ, పసుపు ముద్దలూ, కుంకుమాలేని కేవలం పౌడర్లు, స్నోల, సెంటుగాలుల పాలిపోయిన కృత్రిమపు తేలిక వాతావరణం చూడగానే తనుంటున్న హాస్టలు జ్ఞాపకానికొచ్చింది సంగీతరావుకు.

సంగీతరావు చేతిలోని సంచినీ, మాసిపోయిన నలిగిపోయిన అతని ఆకారాన్నీ, అపరిచితుడిలా గది నెంబరుమీదకు ఎగరేస్తోన్న అతని కొత్త చూపుల్నీ చూసి ఆ ఎదుటి గదిలో చదువుకొంటోన్న ఒకాయన బయటికొచ్చి 'ఎవరు కావాలండీ?' అన్నాడు.

'భానుమూర్తి కావాలి. తొమ్మిదో నెంబరు గది అనుకుంటాను.'

అతను ఒకసారి జాలిగానూ, మరోసారి కుతూహలంగాను చూసి 'ఆయన మీకు ఏమవుతారు?' అన్నాడు.

'భానుమూర్తి స్నేహితుడ్ని' అన్నాడు సంగీతరావు.

'భానుమూర్తి లేనట్టున్నాడు. పది నిమిషాలక్రితమే తలుపుతాళం వేసుకొని ఎక్కడికో వెళ్ళాడు. హోటలుకేమో. రండి అంతవరకు యీ గదిలో కూర్చోండి' అన్నాడు అతను.

సంగీతరావు సంచి లోపలపెట్టి కూర్చున్నాడు. చాలా చికాగ్గావుంది. ఒకరోజల్లా ప్రయాణం. ఎండాకాలపు చెమటలో, రైలుబొగ్గుపొగా, ధూళీ అంటుకుని ఒళ్ళంతా నల్లగా జిడ్డు చేరిపోయింది. బట్టలు మాసిపోయాయి. సరిగా నిద్రలేదు. వేడిచేసింది. మనసంతా ఆదోలావుంది.

''పనిమీద వచ్చారా యీవూరు?'' అన్నాడు అవతలి అతను.

సంగీతరావుకు సమాధానంచెప్పే ఓపిక లేకపోయినా భానుమూర్తిని గురించి తెలుసుకోవాలన్న ఆతృతతో, అతిథి గౌరవం చేస్తోన్న వ్యక్తి మీద చూపించవలసిన విధేయతతో, అవతలివ్యక్తి ప్రశ్నలో భానుమూర్తిని గురించి చెప్పడానికి నాందీధోరణి కనిపించడంతో సంగీతరావు చాలా మెల్లగా, విధేయతతో, స్నేహపూర్వకమైన చూపులతో, సభ్యతను సూచించే విధంగా ''వేరే పనేమీలేదండి. భానుమూర్తిని చూద్దామనే వచ్చాను'' అన్నాడు.

'మీరు సంగీతరావుగారా?' అన్నాడు అతను ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా.

అవునన్నట్టు తలూపాడు.

మీరే కదూ టెలిగ్రాం యిచ్చారు. నేనే అందుకుని భానుమూర్తికి తీసుకెళ్లి యిస్తే చూడకుండగనే చించి పారేశాడు. ఆ ముక్కలన్నీ ఏరి చదివి వినిపించాను' అన్నాడు అతను.

ఆ తర్వాత మళ్ళీ ఆయనే చెప్పాడు.

"మీకు తెలిసే వుంటుంది. ఈ మధ్య భానుమూర్తి బాగా పాడయిపోయాడు. తాగుడు అలవాటయింది. రాత్రిళ్లు ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు. ఎంత మంచివాడు ఎలా అయిపోయాడో ఆలోచిస్తుంటే బాధనిపిస్తుంది. వాళ్లింటికికూడా నేనే వుత్తరం రాశాను."

సంగీతరావుకు అతనిమీద గౌరవం ఏర్పడింది. కొద్దిసేపు అతనితో కబుర్లుచెప్తూ కూర్చున్నాడు.

'అదుగో! వస్తున్నాడు' అన్నాడతను. సంగీతరావు అటు చూశాడు.

బయటి గేటులోంచి భానుమూర్తి వస్తున్నాడు. ఊహించినంత భయంకరంగా ఏమీలేదు. అదే నడక. కంగారుగా దగ్గర దగ్గరగా అడుగులు వేసుకొంటూ గబగబా నడిచేనడక. పెదాలమధ్య నిర్లక్ష్యంగా జారిపోతున్నట్టు సిగరెట్టు. గెడ్డంమాత్రం మాసింది. వెనక చూసి నప్పటికీ యిప్పటికీ మనిషి కాస్త రంగుతేలాడు.

సంగీతరావు గది బయటకొచ్చి నుంచున్నాడు.

అజ్ఞానంలా, మంచులా, నాగరికత మీదకుపాకిన నికృష్టపు నైలాన్ బట్టలా, తాగిన కళ్ళమీద కమ్ముకున్న మత్తులా అల్లుకున్న పొగల్లోంచి సంగీతరావును చూశాడు భానుమూర్తి.

ఓసారి కనుబొమలు ఎగరేసి దగ్గరకొచ్చి 'ఎప్పుడొచ్చావ్?' అన్నాడు.

సంగీతరావు చెప్పాడు.

కాఫీ తాగొద్దామని, ఇప్పుడే అవతలకు వెళ్లాను. రా, గదిలోకి వెళ్దాం'.

ఆ అపరిచిత మిత్రుడికి కృతజ్ఞతలు చెప్పుకుని సంచిలో భాను మూర్తి వెంట బయలుదేరాడు.

తొమ్మిదో నెంబరుగది ఆ యింటికి వెనకవైపున వుంది. చిన్నదే. భానుమూర్తి ఒక్కడే వుంటున్నాడు. తలుపు తీయడంతోనే దుమ్ము ఎగిరింది.

'కూర్చో'

సంగీతరావు కూర్చున్నాడు.

మాటల్లేవు. నిశ్శబ్దంతో బరువెక్కిన వాతావరణం. సంగీత రావుకు విసుగ్గా, యిబ్బంది కలగంగా, ఏ లేబరేటరీలోనో, ఘాటైన వాసనలో వూపిరి సలపని, గొంతుపట్టేసిన వాతావరణంలో కూర్చున్నట్టుంది. అయినా విసుగుని నుదురుమీది ముడతలలోగాని, నిర్లక్ష్యపు చూపులలోగాని, సూదిగాచెక్కిన పదునైన మాటలలో గాని కనుపించనీయక మామూలుగానే, వెనకటి స్నేహంలోని చల్లదనాన్నీ, హాయినీ నింపేవిధంగా, సముద్రపు కెరటాల తుంపర్ల ముందు యిసకలోనూ, విక్రమ దేవవర్మ విగ్రహం నీడలో పచ్చికమీదా, అరకులోయవైపు పోయేబస్సులో కిటికీ దగ్గరగా కూర్చుని ఆప్యాయంగా, ప్రేమగా హృదయాలలోకి తొంగిచూసుకుంటూ మాట్లాడినప్పటి స్వచ్ఛమయిన ఆత్మీయతను ప్రతిఫలింపజేస్తూనే ''ఒంట్లో బావుంటోందా? ఆఫీసులో పని వత్తిడి లేదుకదా? వచ్చేముందు మీ అన్నయ్య కనిపించలేదు. ఏమన్నా కబురు చెప్తాడేమోనని కలుద్దామనుకున్నాను. కాని వీలులేకపోయింది'' అన్నాడు సంగీతరావు.

'బాగానే వున్నాను'

పొడిపొడిగా మార్చి గాలుల్లాగే వున్నాయి మాటలు. నిశ్శబ్దపు అగాధాలతో విడివిడిగా, ఒకదాని కొక్కటి సంబంధం లేనంత ఎండగా వున్నాయి.

ఆ గదికి ఎదురెండ, వీపుమీద వాలుతున్న ఎండకు అడ్డంగా చెలుప రెక్కచేరేసి ముఖంమీద చిరుచెమట తుడుచుకున్నాడు సంగీత రావు.

'స్నానం చేసెయ్యగూడదూ. కుళాయి కట్టేస్తారేమో'

ఈ మాటలు యింతపొడిగా ఎందుకు ఎండిపోయాయి? ఆ కళ్లవెనక, ఆ పెదాల వెనక ఎందుకు హృదయాన్ని దాచుకుంటూ, బయటికి ప్రేమలేనివాడిలా కనిపించాలని, తనను తనే మోసం చేసుకొంటూ ఏమిటా మాటలు? పరాయి వాడిలా, శత్రువులా చూస్తోన్న అతని చూపులు హృదయాన్ని చీలుస్తున్నాయి. సంగీతరావుకు దుఃఖం పొర్లుకొస్తోంది.

నిశ్శబ్దంగా, బరువుగా లేచివెళ్ళి స్నానం చేసివచ్చాడు.

ఇద్దరూ భోజనానికివెళ్లారు. హోటలు అట్టేదూరంలేదు; ముక్తసరి మాటలుతప్ప దీర్ఘ సంభాషణలు లేవు. ఒకరు ముఖాల్లోకి ఒకరు చూసు కోవడం లేదు. చూపులు తప్పించే మాట్లాడుకోవడం.

'గదికి వచ్చేశారు. సంగీతరావును పడుకోమని చెప్పి, తాను ఆఫీసుకు వెళ్ళొస్తాననీ అక్కడనుంచి రావడం ఆలస్యమయితే అతన్ని హోటలుకు వెళ్ళమనీ, హోటలు టిక్కట్ల పుస్తకం అలమార్లో వుంటుంది తీసుకోమని చెప్పి వెళ్ళిపోయాడు.

సంగీతరావు ఒంటరిగా గదిలో మిగిలిపోయాడు. నిద్రపోదామని చాప పరచుకుని పడుకున్నాడు. ఒకవైపు నిద్రమగత రెప్పలమీదకు పాకు

తోంది. మరోవైపు ఆలోచనలు మెల్లమెల్లగా కదులుతున్నాయి. భాను మూర్తి శారీరకంగా అట్టే మారలేదుగాని మానసికంగా చాలా భయం కరంగా మారిపోయాడు. మోసపోయిన జీవితంలోంచి చూడడం నేర్చు కున్నాడు. ఈ కళ్ళను అతను ఎప్పుడు కడుక్కో గలుగుతాడు? గాయ పడిన అతని హృదయంమీద సానుభూతి చన్నీళ్లు చిలకరించడంవల్ల లాభంలేదు. గాజు బుడ్డిలాంటి అతని సున్నితమైన హృదయం దుఃఖ జ్వాలల్లో కాలి ఎర్రబడిపోయింది. దానిమీద ఒక్కసారిగా చన్నీళ్లు చిలకరిస్తే పగిలిపోక తప్పదు.

నిద్రలో కళ్ళు మూతలుపడ్డాయి. మత్తుగా నిద్ర పట్టేసింది. నాలుగింటికిగాని తిరిగి లేవలేదు. ఇంకా మత్తుగానే వుంది. జ్వరం వచ్చి నట్టు వళ్లు నొప్పులుగా వున్నాయి కళ్ళుకూడ మండుతున్నాయి. మరో అరగంట అలాగే పడుకుని లేచాడు. గబగబా తయారై బట్ట లేసుకుని భానుమూర్తిని గురించి ఎదురుచూస్తూ కూర్చున్నాడు. అయిదున్నర.... ఆరు....ఆరున్నరయ్యింది. భానుమూర్తి యింకా రాలేదు.

ఉదయం రూములోకి పిలిచి పలుకరించినతను వచ్చాడు. 'అలా వెళ్ళొద్దాంరండి. బహుశా యిప్పుడప్పుడే భానుమూర్తి రాడేమో' అన్నాడు.

రాకపోవచ్చునని అనిపిస్తున్నా, యింకా ఆశ కొనసమీది ఓందు పులా అంటిపెట్టుకున్న ఆశ. అతను నటించలేక విసిగి అలసిపోయి ఏ క్షణంలోనో మళ్ళీ మామూలుగా పూర్వపు చిరునవ్వునూ, హృద యాన్నీ బైట పెట్టుకొంటూ ఎదుట నుంచుంటాడని అనిపింపజేస్తోంది.

'చాలా మత్తుగా వుందండి ఎక్కడకూ రాలేను క్షమించాలి' అన్నాడు.

అతను వెళ్ళిపోయాడు.

ఒక్కడూ ఏదో నవల చదువుతూ కూర్చున్నాడు. మధ్యలో అక్షరాలు కనిపించకపోతే లైటేశాడు. మళ్ళీ చదువుతూ కూర్చున్నాడు. గదిలో ఉక్కగా వుంది. చెమట పడుతోంది. బట్టలువిప్పి లుంగీ కట్టుకున్నాడు. పుస్తకం తెరిచాడు. చదువుతున్నాడు. నవల ఏమంత ఉత్సాహంగా లేదు. విసుగ్గా వుంది. అయినా చదువుతూ కూర్చున్నాడు. పక్కగదుల్లో వాళ్ళు భోజనంచేసి వచ్చినట్టు త్రేపుతున్న తేన్పులు వినవస్తున్నాయి. జలసంతంగా పుస్తకం మూసేసి వాచీ చూసుకున్నాడు. ఎనిమిదీ ముప్పయ్యయిదు!

సంగీతరావుకు ఆకలేస్తోంది. లేచి అలమారా తీశాడు. హోటలు టిక్కెట్ల పుస్తకం పైనేవుంది. ఓ టిక్కెట్టు చించబోయి ఆగిపోయాడు. వెనక్కి తిరిగొచ్చి పక్కేసుకుని పడుకున్నాడు. మళ్ళీ నవల తీశాడు.

అలికిడయితే గుమ్మంలోకీ, జ్ఞాపకం వచ్చినప్పుడు వాచీమీదకూ చూపుల్ని ఎగరేస్తూ పుస్తకం చదువుతున్నాడు. నగరం నడిబొడ్డునుండి ఒక పక్కకు చీలి నగ్నంగా నిలచిన అద్దాల షాపుల్నీ, నియోన్‌లైట్ల వెలుగుల్నీ దాటుకుని బయలుదేరిన జన సమ్మర్ధపు సిమ్మెంటు బాట పక్కనే, నడిబొడ్డుకు అరఫర్లాంగు దూరంలోనేవున్న ఆ భవనంలో మెల్లమెల్లగా నిశ్శబ్దం చేరుకుంటోంది. అప్పుడప్పుడు కారు హారన్లూ, ఇంజనురొదా వినిపించి మాయమవుతున్నాయి.

అలసిపోయిన సంగీతరావు చూపులు నిద్రతో బరువెక్కి రెప్పలు మత్తుగా, మెల్లమెల్లగా వాలుతున్నప్పుడు నిశ్శబ్దాన్ని బూట్లతో తరుముకుంటూ భానుమూర్తి వచ్చాడు.

"ఇంకా నిద్రపోలేదూ ?" అన్నాడు తెలిగేసివున్న సంగీతరావును చూసి. చాప తొక్కకుండా లోపలికివచ్చి. పెట్టెమీద కూర్చుని బూటు విప్పుతూ "భోజనం అయిపోయింది కదూ ?" అన్నాడు తిరిగి.

సంగీతరావు మాట్లాడలేదు. అతన్నే చూస్తున్నాడు. మనిషి మామూలుగానే వున్నాడు. దువ్వినతల దువ్వినట్టే వుంది. కిళ్ళీ వేసినట్టున్నాడు గాబోలు — నములుతున్నాడు. కాని మాట్లాడినప్పుడు మాత్రం గుప్పున వాసన కొట్టింది. ఊపిరిని గొంతులో బిగించేసిన వాసన. మత్తుగా కదిలిన వాసన.

సంగీతరావుకు అర్థమయింది. మాట్లాడలేదు. అలాగ మిత్రుని కళ్ళల్లోకి చూస్తున్నాడు. సూటిగా చెక్కిన చూపుల్ని అతని కళ్ళల్లోకి గుచ్చి, జారిపోకుండా నిలబెట్టి, ఏ భావమూ లేని ముఖంలోంచి చూస్తున్నాడు.

భానుమూర్తి చూపులు తప్పించేసి "ఏమిటి ! అలా చూస్తావ్. కోపం వచ్చింది గాబోలు—ఆలస్యమయ్యిందని. ఇప్పుడు ఏం చెప్పినా నువ్వు వినేట్టులేవు. సరేలే....పొద్దున్న మాట్లాడుకుందాం, పడుకో" అన్నాడు. బట్టలు మార్చుకుని పక్కలు వేశాడు.

సంగీతరావుకు దుఃఖం కంఠంలో గూడుకట్టింది. కళ్ళల్లోకూడా దట్టమయిన మేఘాలు అల్లుకున్నాయి. ఏ కలలోనో అవి వర్షిస్తాయి గాబోలు !

భానుమూర్తి లైటు ఆర్పేసి వచ్చి పడుకున్నాడు.

సంగీతరావుకు నిద్ర రావడంలేదు. తడిసిన కళ్ళమీదకు నిద్ర పాకలేక జారిపోతోంది. ఒకవైపు బాధ. మరోవైపు ఆకలి. ఉదయం

భోజనం చేసిన తర్వాత మళ్ళీ యింతవరకూ కాఫీ అయినా తాగలేదు. పేగులు కరకర మంటున్నాయి.

సంగీతరావు లేచి లైటేశాడు. కూజాలో నీళ్ళు వంపుకుని గడగడా మూడు గ్లాసులు తాగాడు. లైటార్పి మళ్ళీ వచ్చి పడుకున్నాడు.

లైటుకాంతి కళ్లమీద పడడంతోనే ఓమారు కళ్ళు విప్పిచూసి, మళ్ళీ మూసుకున్నాడు భానుమూర్తి.

రాత్రి కలలేమీ లేవు.

ఉదయం ఏడింటికి సంగీతరావుకు తెలివొచ్చింది. కళ్లు తెరిచాడు. ఆ ఎదురుగావున్న పెట్టెమీద కూర్చుని భానుమూర్తి యిటే చూస్తున్నాడు. సంగీతరావు కళ్ళు తెరవడంలోనే చటుక్కున చూపున్న లాక్కుని సిగరెట్టు పొగలతో తన ముఖాన్ని దాచుకున్నాడు. క్షణంపాటి ప్రేమ, సానుభూతి నిండిన వెనకటి ప్రశాంతమైన ముఖం మెరిసి. సిగరెట్టు పొగల్లో కప్పడిపోయి; పొగలు విచ్చిపోగానే క్రౌర్యం గీతలు గీసిన నుదురుతో, బుసలుకొట్టే పాముల్లా మెలితిరిగిన నల్లటి దట్టమైన ఎనుబొమలతో చిరునవ్వున్ని నిర్దాక్షిణ్యంగా నలిపేస్తున్నట్టు బిగుసుకుపోయిన పెదాలతో, కించకు దిగి గంభీరతను నింపుకున్న సాగిన దౌడలతో అసహ్యమైన పగటివేషం వేసుకున్నట్టున్న కృత్రిమమైన ముఖం కనిపించింది.

సంగీతరావు తిరిగి కళ్ళు మూసుకున్నాడు. అయిదు నిమిషాలు అలానే పడుకుని లేచాడు.

ఊడవడానికి వచ్చిన పనిమనిషిని కాఫీ, టిఫిన్లు పట్టుకురమ్మని పంపించాడు భానుమూర్తి. ఆమె వచ్చేసరికి కాలకృత్యాలు తీర్చుకుని కూచున్నారు.

పొట్లాలువిప్పి ఎదురుగుండా పెట్టాడు భానుమూర్తి. పరాయివాళ్ల లాగ నిశ్శబ్దంగా తింటున్నారు.

"రాత్రి ఎక్కడకు వెళ్ళావ్ ?"

భానుమూర్తి తలవంచి, కాఫీ తాగుతున్నవాడల్లా, వంచినతల ఎత్తకుండానే రెప్పలు ఎగరేసి, పై అంచులమించి క్షణంసేపు చూసి మళ్ళీ తినడంలో మునిగిపోయాడు.

"నిన్న....రాత్రి ఎక్కడకెళ్ళావ్ ?"

భానుమూర్తి చల్లారిపోయిన కాఫీని గడగడా మంచినీళ్ళలా తాగేసి కాఫీ గ్లాసును అటూయిటూ తిప్పుతూ, చటుక్కున చూపుల్ని మిత్రుడి ముఖంమీద నిలిపి "రాత్రి నేను ఎక్కడకు వెళ్ళానో నీకు తెలుసు. తెలుసుండికూడా నన్ను అడుగుతున్నావ్" అన్నాడు.

సంగీతరావు మాట్లాడలేదు. కోపంకూడా వచ్చింది. మౌనంగా కాఫీ పూర్తి చేశాడు.

పనిమనిషి గది తుడిచేసి, గ్లాసులు కడిగేసి వెళ్ళిపోయింది. నిన్నటి నవల తీసుకుని చదువుతూ కూర్చున్నాడు సంగీతరావు. భానుమూర్తి పక్క గదిలోకి వెళ్ళి వాళ్ళతో కబుర్లు చెబుతూ వుండిపోయాడు.

ఇవ్వాళకూడా పొద్దుటినుంచీ వాతావరణం చాలా పొడిపొడిగానే వుంది.

ఆఫీసు టయిమవుతుందనగా భానుమూర్తి వచ్చి "భోజనానికి వెళ్దాం; అక్కడినుంచి నేను అలా ఆఫీసుకు వెళ్ళిపోతాను. నువ్వు రూముకు వచ్చేద్దువుగాని" అన్నాడు.

అలమారాతీసి హోటలు టిక్కెట్లు చింపుతున్నవాడల్లా ఓసారి పరీక్షగా చూసి "ఏమిటి ! రాత్రి నువ్వు అన్నం తినలేదా ?" అన్నాడు.

లేదన్నట్టు తలూపాడు సంగీతరావు.

"ఎందుకని ?"

"ఆకలేయలేదు, అందుకని"

ఆ మాటలు అని, ఆ గదిలో యిక నిలుచోకుండా వెంటనే జోళ్లు తొడుక్కుని బయటికి వచ్చేశాడు. ఇద్దరూ హోటలుకువెళ్ళి భోజనం చేశారు. భానుమూర్తి అక్కడినించే ఆఫీసుకువెళ్తూ 'సరేలే. సాయంకాలం వేగంగానే వచ్చేస్తాను. రూములోనే వుండు. మధ్యలో ఎక్కడికిన్నా వెళ్తే తాళం వేసుకువెళ్ళు' అంటూ తాళంచెవులుయిచ్చి వెళ్ళిపోయాడు.

సంగీతరావు రూముకొచ్చి అక్కడ కూర్చోవడం యిష్టంలేక వూళ్లోకి బయలుదేరాడు. డబుల్ డెక్కర్ బస్సును చూసేసరికి అతనికి సరదా పుట్టింది. అవెక్కి, ఆగిపోయేవరకూ వెళ్ళి, అక్కడినుండి మరోటి ఎక్కి యింకోవైపుగా బయలుదేరి—అలా సాయంకాలంవరకూ తిరిగి రూము చేరుకున్నాడు. అతను వచ్చేసరికి ఆలస్యమయ్యింది.

భానుమూర్తి ఎదురుచూస్తూ పక్కరూములో కూర్చున్నాడు. అర గంట తర్వాత భోజనానికి బయలుదేరారు. అంతవేగంగా భోజనం చెయ్యడం యిష్టం లేకపోయినా మిత్రుడు కూడా వున్నందువల్ల అభ్యంతరం చెప్పలేక పోయాడు.

తిరిగి వస్తున్నప్పుడు 'నీలాంటివాళ్ళ కాతాలు ఓ పదివుంటే చాలు హోటలు వాడు మేడ కడ్తాడు' అన్నాడు సంగీతరావు. భానుమూర్తి అదేమీ వినిపించుకోలేదు.

ఏవో పొడిపొడి మాటల్తో సంభాషణ సాగిపోయింది. ఊరు చూశావా? ఎలా వుంది? ఫలానాది చూశావా? అది ఫలానా—అలాంటి ప్రశ్నలూ, వాటికి సమాధానాలూను.

రూముకొచ్చి కొద్దిసేపు కూర్చుని యిప్పుడే వస్తానని బట్టలేసుకుని

వెళ్ళిపోయాడు భానుమూర్తి. ఆ వెళ్ళడం వెళ్ళడం తిరిగి పదకొండింటికి రూముకు చేరుకున్నాడు.

ఇవ్వాళకూడా అంతే! అదే వరస....నిన్నటి వాసనే. ఈరోజు కాస్త ఎక్కువైనట్టుంది. కొద్దిగా మాట అప్పుడప్పుడు తడబడుతోంది. తనంత తానుగా సంగీతరావు అతన్నేమీ ప్రశ్నించదలచుకోలేదు. ఆయనే మాట్లాడుతున్నాడు. పొడిపొడిగానే అయినా ఆ మాటలు అంతకుముందు కన్నా యిప్పుడే కాస్త ఎక్కువగా వున్నాయి.

అదేమీ పట్టించుకోని వాడిలాగ సంగీతరావు కళ్ళు మూసుకుని పడుకున్నాడు. బాధపడే ఓపికకూడా అతనికిప్పుడు సన్నగిల్లి పోతోంది. ఈ వాతావరణంలోంచి పరుగెత్తి పారిపోదామన్నంత కోపం కూడా వస్తోంది.

ఆ రాత్రి చీకట్లో ఓ కన్నీటి బొట్టు చాలాసేపు ఓ కంటికొసలో వేలాడి వేలాడి చివరకు చెక్కిలిమీదకు జారిపోయింది.

మళ్ళీ రోజు మొదలు!

పగలల్లా వెచ్చగా గాడ్పు. ఆగాడ్పులో ఆవిరైపోయిన కన్నీటితో మిగిలిన పొడికళ్ళు.

సంగీతరావు ఆ మూగబాధను యిక భరించలేక పోయాడు. ఆ రాత్రి భోజనానికి వెళ్ళినప్పుడు భానుమూర్తి తాను భోజనం చెయ్యకుండా 'నువ్వు భోంచేసి రూముకు వెళ్ళు, నాకు పసుంది, మెల్లగా వస్తాను' అని వెళ్ళి పోబోతున్నప్పుడు ఆలా వెళ్ళిపోబోతున్న భానుమూర్తిని పట్టుకుని ఆపి 'నేనూ వస్తాను' అన్నాడు సంగీతరావు.

"ఎక్కడికి ?"

"అదే—బార్ కి"

అసహ్యంగా దవడల్ని కదిలించి ఓ నవ్వు నవ్వాడు భానుమూర్తి. "నువ్వెందుకు....నీలాంటివాడు అక్కడికి రాగూడదు" అన్నాడు.

"లేదు....నాకూ తాగాలని వుంది. వస్తాను"

ఓ నిమిషంసేపు అతనేమీ మాట్లాడక అలానే వుండిపోయాడు. ఆ తర్వాత 'సరే, నీ యిష్టం' అన్నాడు.

ఇద్దరూ బయలు దేరారు

పగలంతా పాలిపోయి రాత్రి రంగులు పులుముకుని మెరుస్తోన్న నగరం రాచవీధుల్లోంచి, వీధి దీపాల తోరణాల కిందనుంచి, నాగరికత తుళ్ళుతున్న బాటలోంచి నడిచి నడిచి, బట్టలన్నీ విడిచి నగ్నంగా నిలుచున్నట్టున ఓ అద్దాల షాపులోకి వెళ్ళారు.

ఖరీదైన వాసనలూ, విట్లూ, నవ్వులూ, నున్నగా స్ఫటికంలా మెరుస్తోన్న టేబిలు మీదనుంచి, మాలిన్యంలేని తెల్లటి స్వచ్ఛమైన గది నాలుగ్గోడల మధ్యనుంచి, పీకపరకూ తాగిన తాగుబోతుల్లా మెర్క్యూరీ బల్బులు కక్కుతున్న తెల్లటి పాలవంటి కాంతుల్లోంచి జారిపోతున్నాయక్కడ.

ఇద్దరూ ఓ టేబిలు ముందు కూర్చున్నారు.

ఇస్త్రీ మడతలుపోని తెల్లటి బట్టల్లో సన్నపాటి పొట్టి వెయిటర్ వచ్చి వాళ్ళముందు నిలుచున్నాడు.

"జిన్—రెండు పెగ్గులు" అన్నాడు సంగీతరావు.

భానుమూర్తి ఆశ్చర్యంగా చూశాడు.

సోడాలతోపాటు జిన్ తెచ్చాడు వెయిటర్.

గ్లాసుల్లోపోసి సోడా వంపుతున్నాడు సంగీతరావు.

భానుమూర్తికి యింకా అస్పష్టంగానే వుంది. ఆ విషయమేమీ వ్యక్తం చేయకుండా సిగరెట్టు కాల్చుకోవడంలో మునిగిపోయాడు. ఒక వైపు మిత్రుడు రెండు గ్లాసుల్లోనూ జిన్ పోసి సోడాతో నింపడమూ, తన ముందు ఒక గ్లాసు పెట్టి, అతనొకి గ్లాసు ఎదుట పెట్టుకుని అందులోకి చూస్తూ వుండడమూ—అంతా గమనిస్తూనే అటు చూడనట్టు నిర్లిప్తంగా సిగరెట్టు కాల్చుకోవడంలో లీనమైపోయాడు.

"భానూ! ముందది తీసుకో, తర్వాత సిగరెట్టు కాల్చుకుందువు గాని."

సంగీతరావు గ్లాసుతీసి నోటిదగ్గర పెట్టుకున్నాడు. గ్లాసు అంచుల మీదకు ఉబికి వచ్చిన తెల్లటి నురగ పెదాలమీద అంటుకుంది. గొంతు పైకెత్తి గ్లాసు వంచబోయాడు సంగీతరావు.

కాని—

భానుమూర్తి వేళ్ళు గ్లాసుచుట్టూ అల్లుకుపోయాయి. అతని నోటి దగ్గర్నుంచి గ్లాసు లాక్కున్నాడు. భుజం పట్టుకుని బరబరా కౌంటర్ దగ్గరకు తీసుకుపోయాడు భానుమూర్తి. బిల్లు చెల్లించేసి బయటికి లాక్కొచ్చాడు.

ఇద్దరు ముగ్గురు టేబిలుమీద నిండుగావున్న గ్లాసుల్నీ, వెళ్ళిపోతున్న వాళ్ళిద్దర్నీ మత్తునిండిన కళ్లల్లోంచి చూసి నవ్వుకున్నారు.

మిత్రులిద్దరూ వీధిలో నడుస్తున్నారు. సంగీతరావు చెయ్యి భానుమూర్తి చేతిలో వుంది. ఒకరి వేళ్ళు మరొకరి వేళ్లను పెనవేసుకున్నాయి.

మాట్లాడకుండా నడుస్తున్నారు. కంగారుగా అడుగు లేస్తున్నారు. పాములా బుసలుకొట్టే నగరం ట్రాఫిక్ నోట్లోంచి తప్పించుకుని చీకటి సందుల్లోంచి, మురికి గల్లీల్లోంచి నడిచి రూము చేరుకున్నారు.

తలుపు తాళంతీసి లోపలికి వెళ్ళడంతోనే అమాంతం మిత్రుడ్ని కావలించుకుని "సంగీతరావ్! నన్ను క్షమించు. నిన్ను చాలా బాధ పెట్టాను. ఇక ఎప్పుడూ యిలా ప్రవర్తించను...." అతని కంఠం బొంగురుపోయింది. మాట్లాడలేక పోయాడు.

సంగీతరావు మనసు ఆనందంతో నిండిపోయింది. ఆనందాన్ని భరించలేక పిచ్చివాడిలా చూస్తూ నుంచుండి పోయాడు.

ఆ రాత్రి ఒకరి కంటిపాపల్లో మరొకరు ప్రతిబింబాల్ని వెతుక్కుని, ఒకరి హృదయంలోకి మరొకరు తొంగిచూసుకుని, ఒకరిమీద ఒకరు సానుభూతి చన్నీళ్లు చిలకరించుకుని వాతావరణాన్ని తడితడిగా, హాయిగా, మనోహరంగా చేసుకున్నారు.

మరో మూడురోజులు సంగీతరావు అక్కడే వున్నాడు. ఆమూడు రోజులూ భానుమూర్తి ఆఫీసుకు సెలవు పెట్టేశాడు. ఇద్దరూ సరదాగా ఊరల్లా తిరిగారు. సినిమాలు చూశారు. గదిలో తలుపులు వేసుకుని పాటలు పాడుకున్నారు.

సంగీతరావు తిరిగి బయలుదేరే రోజున భానుమూర్తి స్టేషనుకు వచ్చాడు. అతని కళ్ళల్లో. అతని మనసు ప్రతిఫలిస్తోంది. దగ్గర్నుంచి చూసినప్పుడు సంగీతరావుకు తనుకూడా అందులో ప్రతిఫలిస్తూ కనిపించాడు. ఇప్పుడతని హృదయ భారమంతా తీరిపోయింది. నిశ్చింతగా అతను వెళ్ళిపోయాడు.

ఉత్తరాలు మామూలుగా వస్తూపోతూ వున్నాయి. సంగీతరావు రిజల్ట్సు వచ్చాయి. క్లాస్ రాలేదు. పాసయ్యాడు. అంతకుముందు పరీక్షల్లో ఎప్పుడూ అలాకాలేదు. దీనికి కారణం అతనికి తెలుసు. భానుమూర్తిని గూర్చిన ఆలోచనల్తో మానసిక ఆందోళన ఏర్పడి, చదువు మీద మనసు లగ్నం చెయ్యలేకపోయాడు. అయినా అతను అట్టే బాధ పడదలచుకోలేదు.

క్లాసు రాకపోయినందుకు భానుమూర్తి కోపంగా ఉత్తరం రాశాడు. పియుసి లోనూ, బి ఏ లోనూ క్లాసు తెచ్చుకున్నవాడివి యిప్పుడిలా తగ లెట్టావేమిటి? ఈ మార్కులు చేత్తో పట్టుకుని కాళ్ళరిగిపోయేట్టు తిరిగితే నీ కొచ్చేదేమిటి—మామూలు గుమాస్తా ఉద్యోగం. ఇంత చదువూ చదివి చివరికి రాజకీయ పక్షులు పట్టిన గొడుగు నీడలకింద కుర్చీ వేసుకూర్చున్న అధికారులముందు చేతులు కట్టుకుని నుంచుని, వాళ్ళ సొంత పనులు చెప్తే ఆఫీసు పనికన్నా అర్జంటుగా చేసిచ్చి, వాళ్ళ అడుగులకు మడుగు లొత్తాల్సిన ఖర్మేమిటి నీకు. క్లాసు వచ్చుంటే ఎక్కడో ఓ దగ్గిర లెక్చరరు ఉద్యోగమన్నా దొరికేదికదా...."

సంగీతరావు జాలిగానూ, బాధగానూ నవ్వుకున్నాడు.

నాలుగు నెలలు ఉద్యోగం గురించి ప్రయత్నాలు చేసిచేసి విసిగి పోయాడు. చివరకు భానుమూర్తి సలహా ప్రకారం హైదరాబాదు వచ్చేశాడు. పదిహేనురోజుల తర్వాత ఎల్. డి. సి. ఉద్యోగం దొరికింది.

ఇద్దరూ ఒకే రూములో వుంటున్నారు.

చూస్తుండగానే ఆరునెలలు గడిచిపోయాయి.

వెనకెప్పుడో భానుమూర్తి ఒక ఉద్యోగం విషయంలో చేసిన ప్రయత్నాలు యింత కాలానికి ఫలించాయి. సర్కారు జిల్లాలవైపు వెళ్ళి

పోపలసి వచ్చింది. మిత్రుడ్ని వదలి పెట్టడం అతనికీ బాధగానే వుంది. కాని అభిరుచికి తగిన వుద్యోగం. అక్కడ కొంతకాలం వుండి మెల్లగా విశాఖపట్టణానికి మార్పించుకుంటే బావుంటుందని అతని ఉద్దేశం.

సంగీతరావు కూడా వెళ్లమనే బలవంతం చేశాడు. 'నేనుకూడా అటే వచ్చేస్తాను ఈ వెధవ ఉద్యోగం పట్టుకుని వేలాడుతూ కూర్చుంటానా. నువ్వు ముందు అక్కడకు చేరుకుంటే ఆ తర్వాత నేనూ వస్తాను' అన్నాడు.

భానుమూర్తి బాధపడుతూనే ఊరు విడిచి వెళ్ళిపోయాడు.

నిజానికి ఈమార్పు కూడా కొంత అవసరమే అనిపించింది. మరీ సన్నిహితంగా వచ్చి, అకస్మాత్తుగా దూరమైపోతామేమోనని భయం. దగ్గరగా వున్నప్పుడు ఒకొక్కసారి ఎదుటివారి మంచితనం కూడా బాధగానే వుంటుంది. దూరంనించి ఒకరికొకరు మరీ ఆకర్షణీయంగా కనిపిస్తారు. అందుకే వుత్తరాల్లోవున్న ఆకర్షణ ఎదురుపడితే వుండదు.

భానుమూర్తి వెళ్ళిపోవడంతోనే సంగీతరావుకు ఆ ఒంటరితనం కొంతకాలం వరకూ బాధగానే వుండేది. తర్వాత తర్వాత యిలా దూరంగానే వుండి వుత్తరాలతో తరచు పలకరించుకోవడంలోనే ఆనందం వున్నట్టు అర్థమయ్యింది.

భానుమూర్తి కోరికమీద 'లా' ఈవినింగ్ కాలేజీలో చేరాడు సంగీతరావు.

అక్కడ అతనికి ఒకకొత్త మిత్రుడు ఏర్పడ్డాడు. పేరు వరహాలరావు. సెక్రటేరియట్‌లో వుద్యోగం. నాటకాలు వేస్తుంటాడు. పొడుగైన చేతులు, ఎత్తయిన భుజాలు, విశాలమైన ఛాతీ, విగ్గులాటి తల,

పెద్ద నుదురుతో, పొడుగుదేరిన దౌడలతో, కంఠంలోకి సాగిన కోల ముఖంతో—చక్కటి పర్సనాలిటీవున్న మనిషి. మామూలుగా మాట్లాడుతున్నప్పుడు కూడా కళ్ళరెప్పల్ని కొట్టుకొంటూ, నొసలు చిట్లించి ముడతలుతీస్తూ అభినయం చేస్తుంటాడు. అందువల్ల ఆకర్షణ ఎక్కువ. కంఠం కూడా మంచిదే. మైక్‌కు సరిపోతుంది.

కాలేజీ ఎలక్షన్‌లలో పరిచయమయ్యాడతను. ఆ తర్వాత చూస్తుండగానే సన్నిహితంగా వచ్చేశాడు.

అతన్ని గురించి చాలాసార్లు ఉత్తరాలలో భానుమూర్తికి రాసేవాడు సంగీతరావు. భానుమూర్తిని గురించికూడా అతనికి చెప్తుండేవాడు.

వరహాలరావు ఎంతమందితో నన్నా సమానంగా స్నేహం చెయ్యగలడు. నెలల తరబడి కనిపించకపోయినా కూడా, కనిపించినప్పుడు అభిమానంతో ముంచెత్తి, స్నేహాన్ని నిలుపుకోగలడు. అయితే సంగీతరావు ఆ అభిమానాన్ని భరించలేడు. అది నటనలా అనిపిస్తుంది అతనికి. తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో, వరద వెల్లువలాంటి అభిమానంతో ముంచెత్తి, విడిపోయాక మళ్ళీ తలంచనన్నా తలంచకపోతే అందులో ఆత్మీయత లేదని సంగీతరావు అభిప్రాయం. స్నేహం నిత్యం మెల్లగా హుందాగా మనోహరంగా హేమంతంలోని నదిలా కదలాలిగాని వర్ష ఋతువులోని కొండవాగులా వుండకూడదనుకుంటాడు సంగీతరావు. అందుకే అతను మరీ సన్నిహితంగా వెళ్ళిపోక యిద్దరిమధ్యా కొన్ని హద్దులు గీసుకుని ఆగిపోయాడు. అదీగాక భానుమూర్తిలాంటి వ్యక్తి తనకు మరొకరు వుండడం భానుమూర్తికి ద్రోహం చెయ్యడమేనని అతని భావం.

సంగీతరావు 'లా' మొదటి సంవత్సరం పాసయ్యాడు. వరహాల రావు‌ది పోయింది. బాగా డబ్బున్నవాడు. డిగ్రీ గురించి పడవడం లేదు. కాలక్షేపానికి చదువుతున్నాడు. పరీక్ష పోయినా విచారించలేదు.

ఆ ఏడాదిలోనూ స్వగ్రామం వెళ్తూ భానుమూర్తి దగ్గరదిగి రెండు రోజులు గడిపి వచ్చాడు సంగీతరావు. అలా అతన్ని చూసికూడా నాలుగు నెలలు పైన బడుతోంది.

విశాఖకు ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలు చేసుకుందామని ఎప్పటినుంచో వస్తాను వస్తాను అంటూ చివరకు ముందుగా వుత్తరం రాయకుండానే వూడిపడ్డాడు భానుమూర్తి. వచ్చిన రోజునే కలవవలసిన వాళ్ళందర్నీ కలిశాడు. "అలాగే చూస్తాం" అన్నారు వాళ్ళు.

మర్నాడు ఆదివారం.

మార్నింగ్‌షోకు వెళ్దాం అని బయలుదేరబోతుండగా వరహాల రావు వచ్చాడు. ఆయనకూడా సినిమాకు వెళ్దామనే వచ్చాడట.

ఒకరి కొకర్ని పరిచయం చేశాడు.

ముగ్గురూ సినిమాకు వెళ్ళారు. వరహాలరావే టిక్కెట్లు తీశాడు. ఇంటర్‌వల్‌లో కేంటీనుకు తీసుకెళ్ళాడు. రిక్షాలకుకూడా ఆయనే డబ్బు లిచ్చాడు.

ఆ మధ్యాహ్నం వరహాలరావుకూడా వాళ్ళతోనే హోటల్లో భోజనం చేశాడు. తర్వాత సాయంకాలం వరకూ గదిలోనే కబుర్లు చెప్పుకుంటూ కూర్చుండిపోయారు. సాయంకాలం మాత్రం వూళ్ళోకివెళ్ళి రాత్రివరకూ తిరిగారు. మధ్యలో తాజ్‌లో కాఫీలూ, ఇంకోచోట కూల్‌డ్రింకులూ తాగారు. అన్నింటికీ వరహాలరావే ఖర్చుపెట్టాడు. చివరకు మర్నాడు కలుస్తానని చెప్పి పదకొండింటికి వెళ్ళిపోయాడు వరహాలరావు.

ఒక్క రోజులోనే భానుమూర్తికి వరహాలరావు ఎంత సన్ని హితంగా వెళ్ళిపోయాడో చూస్తుంటే సంగీతరావుకు అసూయకూడా కలిగింది. తన వునికే మర్చిపోయి నిమిషాల తరబడి వాళ్ళిద్దరూ మాట్లాడుకొంటున్నప్పుడు ఒకొక్కసారి బాధపడ్డాడు కూడాను. ఆ తర్వాత ఆలోచించి మరీ యింత చిన్నపిల్లాడి మనస్తత్వమేమిటి—అనుకుని నవ్వు కున్నాడు.

మర్నాడు ఉదయాన్నే వరహాలరావు వచ్చాడు. కాని అప్పటికే భానుమూర్తి బయటికి వెళ్ళిపోయాడు. సికింద్రాబాదులో ఎవరెనో కలుసు కోవాలనీ, అక్కడే మధ్యాహ్నం భోంచేసి, రూముకొచ్చి కాస్సేపు పడు కుని, సరిగ్గా అయిదింటికి ఆఫీసుకు వచ్చి కలుసుకుంటాననీ, వరహాల రావుతోకూడా చెప్పమనీ చెప్పి తాళంచెవి ఎక్కడ పెడతాడో కనుక్కొని వెళ్ళిపోయాడు. సంగీతరావు ఆ సంగతి తెలియజేశాడు.

వరహాలరావు భోంచేసి రాలేదు. సంగీతరావుతో కలిసి హోటల్లో భోంచేసి అక్కడనుండి యిద్దరూ ఆఫీసుకు వెళ్ళిపోయారు. సాయం కాలం అంతా కలుసుకుందామనుకున్నారు.

ఆ సాయంకాలం భానుమూర్తి గురించని పది నిమిషాలు ముందు గానే బయటికొచ్చి గేటుదగ్గర ఎదురుచూస్తూ నుంచున్నాడు సంగీతరావు.

అయిదున్నర....అయిదూ ముప్పావు....ఆరుకూడా అయ్యింది. భానుమూర్తి రాలేదు. కనీసం వరహాలరావన్నా కలవలేదు. వెళ్ళిపోదామని బస్సుస్టాపులో నిలుచున్నప్పుడు వరహాలరావు సెక్షన్ టైపిస్టు ఒకతను కనిపిస్తే అడిగాడు. మధ్యాహ్నమే వరహాలరావు వెళ్ళిపోయాడట.

ఆరున్నరకి రూముకు చేరుకున్నాడు. తలుపు తాళం వేసివుంది..

కిటికీ వెనక సంకేత స్థలంలో వుంచిన తాళంచెవి తీసి తలుపు తెరిచాడు. భానుమూర్తి వచ్చి వెళ్లాడనడానికి చిహ్నంగా ఆరోజు పేపరూ, మరికొన్ని మేగజైనులూ చాపమీద వున్నాయి.

భోజనం చెయ్యకుండా అతని గురించే ఎదురుచూస్తూ కూర్చు న్నాడు.

పదింటికి వరహాలరావూ, భానుమూర్తీ వచ్చారు.

"నా గురించి చూస్తూ కూర్చున్నావేమిటి. మధ్యాహ్నం వరహాల రావుగారు రూముకొస్తే ఆయనతో బయలుదేరాను. వెనక నేను పనిచేసిన ఆఫీసుకు వెళ్తే అక్కడే అయిదున్నర అయ్యింది. ఇక నువ్వుండవేమో నని పబ్లిక్ గార్డెన్స్‌కు వెళ్ళి అక్కడో అభ్యుదయ కవి కనిపిస్తే...."

సంగీతరావు వినడంలేదు. ముద్ద మాటలూ, నోట్లోంచి జారు తోన్న వాసనా అతని మనసును ఆలోచింపజేయ నివ్వడంలేదు. చాలా సేపు వాళ్ళిద్దరి కళ్ళల్లోకీ చూస్తూ నిర్లిప్తంగా వుండిపోయాడు.

"ఆల్‌రైట్ ! నే వస్తా. రేపు కలుస్తాలెండి. వస్తాను సంగీతరావు గారూ !" కత్తిలా నడిచి వెళ్ళబోయి తూలి నిలదొక్కుకుని, ఓసారి నవ్వుకుని చీకట్లో కలిసిపోయాడు వరహాలరావు.

ఇంకా అలానే చూస్తోన్న మిత్రుడ్ని ఉద్దేశించి "భోజనం అయి పోయిందిలే. వరహాలరావు బలవంతం చేశాడు. పక్క వేస్తావా పడు కుందాం—ఆలస్యం అయిపోయినట్టుంది" అన్నాడు భానుమూర్తి.

సంగీతరావు మాట్లాడలేదు. అతన్ని ప్రశ్నించడంకూడా అనవ సరమనిపించింది. మౌనంగా పక్కలు వేశాడు. భానుమూర్తి బట్టలు మార్చుకుని పడుకున్నాడు.

సంగీతరావు మనసంతా పచ్చిపుండులా వుంది. అతనికి వరహాల రావుమీద చాలా కోపం వచ్చింది. వరహాలరావు తాగుతాడు. అలవాటు కొద్దీ తాగడు. అదొక సరదా. అతనికి అనేకమంది రచయిత మిత్రు లున్నారు. బార్‌లలో జరిగే వాళ్ళ కావ్యావిష్కరణలకి, లేదా కావ్యా విష్కరణ రోజురాత్రి వాళ్ళిచ్చే బార్ పార్టీలకి హాజరవుతుంటాడు. ఫేన్సీగా తాగడంతప్ప అలవాటు లేదు. కాని అందరికీ తనలాంటి నిగ్రహ శక్తి వుండదనీ, స్నేహపూర్వకంగానైనా వాళ్ళను ఆ మార్గంలోకి తీసు కెళ్ళడం ప్రమాదకరమనీ అతను ఆలోచించలేదు. లిక్కర్‌తో స్నేహాన్ని అతికించాలని ప్రయత్నించాడు.

సంగీతరావుకు ఎందుకో భయంగా వుంది. తన చేతుల్లోంచి ఏదో వస్తువు జారిపోతున్నట్టు గింజుకున్నాడు.

రాత్రి ఆకలివల్లా, బాధవల్లా సరిగా నిద్రే లేదు.

మర్నాడు మధ్యాహ్నం బండికి భానుమూర్తి వెళ్ళిపోతానంటే ఏమాత్రం అభ్యంతరం చెప్పలేదు. ఆరోజు సెలవుపెట్టి స్టేషనుకు వెళ్లి పంపించేశాడు.

ఆ సాయంకాలం ఆఫీసునుంచి తిన్నగా సంగీతరావు రూము కొచ్చాడు వరహాలరావు. గదిలో ఒక్కడ్నీ చూసి "భానుమూర్తిగారు ఎక్కడికెళ్ళారూ ?" అన్నాడు.

"ఊరెళ్ళిపోయారు" అన్నాడు, సంగీతరావు. అంతకన్నా ఎక్కు వగా మాట్లాడాలనిపించలేదు అతనికి.

చాలాసేపు మౌనంగా కూర్చుని "సినీమాకు వెళ్దాం వస్తారా" అన్నాడతను.

సంగీతరావు పనుందని తప్పించుకున్నాడు. అతను వెళ్లిపోయాడు.

భానుమూర్తి వచ్చి వెళ్ళాక మూడు నాలుగు ఉత్తరాలు మామూలుగానే వచ్చాయి. ఆ తర్వాత అకస్మాత్తుగా ఉత్తరాలు ఆగిపోయాయి. అటని దగ్గర్నుంచి ఉత్తరం వచ్చి మూడు వారాలయ్యింది. మళ్ళీ లేదు. సంగీతరావు నాలుగు ఉత్తరాలు రాశాడు. సమాధానం లేదు. చివరకు టెలిగ్రాంకూడా యిచ్చాడు. దానికీ ఫలితం లేకపోయింది.

ఏం జరిగివుంటుందో సంగీతరావు వూహించుకోగలిగాడు.

తను భయపడినట్టే జరిగింది. దీని కంతటికీ కారకుడు వరహాలరావు. ఒకసారి పగిలిపోయిన స్నేహాన్ని అతి కష్టంమీద అతికించుకుని, జాగ్రత్తగా దాచుకుంటూ వస్తోంటే, అమాంతం దాన్ని చేతుల్లోంచి తోసేశాడు వరహాలరావు. ఈ పగిలిన ముక్కలు మళ్ళీ అతికించడానికి కూడా పనికిరావు. ఒకసారి వ్యసనాల్లోంచి అతి కష్టంమీద బయటపడిన వ్యక్తి మళ్ళీ ఆ బురదలోకి దిగితే యిక వెలుపలకి రావడం కష్టం. ఈ స్నేహం గురించే తను చదువును అలక్ష్యంచేసి, క్లాసు పోగొట్టుకుని, యీ వెధవ వుద్యోగంలో కొట్టుకుంటున్నాడు.

—అతనికి వరహాలరావుమీద విపరీతమైన కోపం వచ్చింది. అతన్ని క్షమించే సహనంకూడా సన్నగిల్లిపోయింది. 'అతన్ని క్షమించ కూడదు'— అనికూడా అనుకున్నాడు.

ఒక సెలవురోజు సాయంకాలం బజార్లోకి వెళదామని గేటుదాటి వీధిలో కొచ్చేసరికి దూరంగా ముగ్గురు మిత్రుల్ని వెంటబెట్టుకొని యిటే వస్తున్నాడు వరహాలరావు.

ఆ రావడం తన దగ్గరకే అని తెలుసు. చూసి నవ్వుతున్నాడు కూడాను.

అతను కనిపిస్తే ప్రకటించాలని యిన్నిరోజులుగా సంగీతరావులో అణిగివున్న కోపం ఒక్కసారిగా సంధ్యలా ముఖంమీదకు పాకింది. అతని కళ్ళముందు పతనమైన భానుమూర్తీ, ఫర్స్ట్‌క్లాసు గుమాస్తాగిరీ, చెల్లాచెదరైన గాజు పెంకుముక్కలూ కదిలాయి.

కసితో, కోపంతో, బాధతో అతని పిడికిళ్లు బిగుసుకుపోయాయి. పళ్ళు పటపట మన్నాయి.

అటువైపుగా వస్తోన్న రిక్షాను ఆపించి లోపలికి ఎక్కి కూర్చుని "పోనీ వేగంగా యిక్కడ్నుంచి పోనీ" అన్నాడు సంగీతరావు.

వెనకనించి వినిపిస్తోన్న చప్పట్లను కూడా వినదలుచుకోని వాడిలాగ రెండు చెవులూ మూసుకున్నాడు.